https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 9 శనివారం 2-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

# కార్మికుల పక్షమే..

## ఆర్టీసీ సమస్యలను వంద శాతం పరిష్కరిస్తాం

**సంస్థ ఆగిపోతే ఊపిరి పోయినట్లే: సీఎం రేవంత్‌రెడ్డి..**

**ముఖ్యమంత్రిని కలిసిన కార్మిక సంఘాల నేతలు**

హైదరాబాద్, మే 1:
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) బస్సుల నిర్వహణలో డీజిల్ ఖర్చులు తగ్గించుకునేందుకే విద్యుత్ (ఈవీ) బస్సులను వాడుకలోకి తెస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈవీ బస్సుల కారణంగా సంస్థలో ఏ ఒక్క డ్రైవర్‌నూ తగ్గించబోమని ప్రకటించారు. కార్మికులతోనే ప్రభుత్వం ఉంటుందని, వారి సమస్యలను వంద శాతం పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధి, మనుగడ, గౌరవాన్ని పెంపొందించి ప్రజలకు మంచి సేవలందించే కార్యాచరణ కోసం ముందుకు వచ్చినందుకు అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు పట్టుదలతో పనిచేయడం వల్లే దేశంలోనే గొప్ప సంస్థగా ఆర్టీసీ నిలిచిందన్నారు. "నేను వేరు, మీరు వేరు అనే భావన ఎన్నడూ లేదు. అందరం కలిస్తేనే ప్రభుత్వం. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని ఆర్టీసీ కార్మికులు కోరుకున్నారు. ఆర్టీసీ కార్మికుల పోరాటాల్లో మేమూ ఉన్నాం" అని సీఎం అన్నారు. గాజులరామారంలో వంద ఎకరాల్లో బస్ టెర్మినల్, శంషాబాద్‌లో 150 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. 1000 ఈవీ బస్సులు కొనుగోలు చేసి మెట్రోతో అనుసంధానం చేస్తున్నామని, మినీ బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అందజేయాలనుకుంటు న్నామని చెప్పారు. డీజిల్‌పై ఆర్టీసీకి ఏటా రూ.2 వేల కోట్ల ఖర్చు అవుతుందని, ఈ ఖర్చును తగ్గించుకోవడానికే ఈవీ బస్సులు తెస్తున్నామని వెల్లడించారు.



**బకాయిలు క్లియర్ చేస్తున్నాం..**

ఆర్టీసీలో బకాయిలు తమ ప్రభుత్వ హయాంలో పెట్టినవి కావని సీఎం రేవంత్ అన్నారు. కానీ, వాటిని క్లియర్ చేసేందుకు తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ ఈసారి ఉద్యోగులకు రూ.1000 కోట్ల బకాయిలు విడుదల చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపడుతున్నామని, ఏవైనా సమస్యలు ప్రభుత్వం దృష్టికి వస్తే.. వెంటనే పరిష్కరించానని తెలిపారు. కార్మికులు, డిపో మేనేజర్ల మధ్య గ్యాప్ రాకుండా అధికారులు చూడాలన్నారు. సంస్థ ఆగిపోతే ఊపిరి పోయినట్లేనని, సంస్థకు నష్టం జరిగే పనులు చేయొద్దని కార్మిక సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీలో యూనియన్లు, విలీనం అంశాల్లో శాశ్వత పరిష్కారానికి యూనియన్లు చర్చించుకుని ప్రభుత్వం ముందు ఆప్షన్ పెట్టాలని సీఎం సూచించారు. ఆర్థిక అంశాలతో కూడిన పీఆర్సీ వంటి విషయాల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఆర్టీసీ అప్పులపై ఉన్న వడ్డీ భారాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని, సంస్థను బలోపేతం చేసుకుని నిలబెట్టుకునేందుకు కార్మికులు సహకరించాలని కోరారు. మహాలక్ష్మి పథకంతో రూ.8 వేల కోట్లు ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించిందన్నారు.

**సమ్మె కేసుల ఎత్తివేత..**

సమ్మె కాలంలో ఆర్టీసీ కార్మికులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, మూడు రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేయగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్, ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్(ఆర్), టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్, టీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్, టీఎస్ ఆర్టీసీ కార్మిక పరిషత్, టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, తెలంగాణ ఆర్టీసీ బహుజన కార్మిక యూనియన్, తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్, టీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘ్, టీఎస్ ఆర్టీసీ సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్, టీఎస్ ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్, తెలంగాణ స్టేట్ ఆర్టీసీ బహుజన్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉన్నారు.

# భయపడకు బిడ్డా.. కాపాడుకుంటా!

**మధ్యప్రదేశ్ పడవ ప్రమాదంలో తల్లి, నాలుగేళ్ల కొడుకు మృతి**

**బిడ్డను కాపాడుకునేందుకు తన ప్రాణాలనూ లెక్క చేయని తల్లి**

**ప్రమాదంలో మొత్తం 9మంది మృతి.. ఆరుగురు గల్లంతు**



**జబల్‌పూర్, మే 1:**
భయపడకు నాన్నా.. నేనున్నా.. నీకేం కాదు.. నేను నిన్ను కాపాడుకుంటా.. అని ఆ తల్లి ధైర్యం చెప్పడానికి ప్రయత్నించిందేమో.. ఏదైనా అద్భుతం జరుగుతుందేమో, ఎవరైనా వచ్చి కాపాడుతారేమో అని చివరిశ్వాస వరకు ఎదురు చూసిందేమో.. తన ప్రాణాలను లెక్కచేయకుండా కొడుకును అదిమి పట్టుకొని, ప్రాణాలను వదిలేసింది ఆ తల్లి. మధ్యప్రదేశ్ లోని జబల్‌పూర్ జిల్లా బర్గి డ్యామ్‌లో పడవ మునిగిన ఘటనలో చనిపోయిన ఈ తల్లీకొడుకుల చిత్రం అందరినీ కలచివేస్తోంది. బర్గి డ్యామ్ నర్మదా నదిపై ఉంది. ఈ డ్యామ్ లో గురువారం సాయంత్రం ఓ పర్యాటక పడవ తుఫాను లాంటి బలమైన గాలుల కారణం గా తిరగబడింది. దీంతో,9మంది నీట మునిగి చనిపోయారు. ఆరుగురు గల్లంత య్యారు. నలుగురి మృతదేహాలను గురువా రమే వెలికి తీయగా, శుక్రవారం మరో ఐదు మృతదే హాలను బయటకు తీశారు. శుక్రవారం వెలికితీసిన ఐదు మృతదేహాల్లో ఈ తల్లి, ఆమె నాలుగేళ్ల కుమారుడు కూడా ఉన్నారు. వీరి ద్దరు ఒకరినొకరు గట్టిగా పట్టుకొని ఉన్న ఆ దృశ్యం అక్కడ ఉన్నవారికి కంటతడి తెప్పించింది.

# నీట్ పరీక్ష రేపే

**రాష్ట్రం నుంచి 73,084 మంది అభ్యర్థులు**

**హైదరాబాద్, మే 1**
దేశవ్యాప్తంగా వైద్య విద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత పరీక్ష (నీట్ యూజీ-2026) ఆదివారం జరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పరీక్ష నిర్వహణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసింది. గతేడాదితో పోలిస్తే ఈసారి అభ్యర్థుల సంఖ్యతోపాటు పరీక్ష కేంద్రాల సంఖ్య కూడా పెరిగింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులు నిర్ణీత సమయం కన్నా అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సివుంటుందని అధికారులు పేర్కొన్నారు.

# అవినీతి కోసమే ఎక్సెస్ టెండర్లు!

**అసెంబ్లీలో మేము చెప్పిందే ఇప్పుడు నిజమైంది**

**రేవంత్ చర్యలతో ప్రభుత్వానికి నష్టం: హరీశ్**



**హైదరాబాద్, మే 1**
కాంగ్రెస్ పెద్దలు తమ అవినీతి కోసం హ్యామ్ రోడ్లకు సంబంధించి అంచనా వేసిన విలువ కంటే అధిక ధరలకు (ఎక్సెస్) టెండర్లు వేయించారని, అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆధారాలతో సహా తాము చెప్పిందే ఇప్పుడు నిజమైందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల్లో 25 టెండర్లను అధిక ధరలకు కొందరికి కట్టబెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైందని ఆరోపించారు. ఆర్అండ్‌బీ శాఖలో రూ. 11 వేల కోట్లకు టెండర్ పిలిస్తే దానిని రూ. 15 వేల కోట్లకు, పంచాయతీరాజ్ శాఖలో రూ.6వేల కోట్ల టెండర్లను దాదాపుగా రూ. 8 వేల కోట్లకు కట్టబెట్టను న్నట్లు తెలిపారు. వీటిలో ఒకే కంపెనీకి 15 టెండర్లు దక్కనున్నాయని, ఆ వివరాలను త్వరలోనే ఆధారాలతో సహా బయట పెడతానని తెలిపారు.

# స్కిల్ సెంటర్లుగా లేబర్ అడ్డాలు !

**సీఎం చంద్రబాబు**

**తొలుత 15 నగరాల్లో ఈ అడ్డాల ఏర్పాటు: సీఎం**


**ఫోన్‌చేస్తే చాలు.. కార్మికులను పంపుతారు**

**కూటమి రాకతో ప్రజలకు స్వాతంత్ర్యం**

**కృష్ణా జిల్లాలో 'పేదల సేవలో' చంద్రబాబు**

**ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం**

**విజయవాడ, మే 1 :**
రాష్ట్రంలో కార్మికులంతా గౌరవంగా జీవించేందుకు లేబర్ అడ్డాలను ఏర్పాటు చేస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. మొత్తం 15 నగరాల్లో ఈ అడ్డాలు నిర్మిస్తామన్నారు. అవసరమైన వారు ఫోన్‌చేస్తే ఇవి కార్మికులను సమకూరుస్తాయని చెప్పారు. రాబోయే రోజుల్లో వీటిని స్కిల్ డెవల్‌పమెంట్ సెంటర్లుగా మారుస్తామన్నారు. మేడే సందర్భంగా కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం పమిడిముక్కలలో 'పేదల సేవలో' కార్యక్ర మాన్ని శుక్రవారం నిర్వహించారు. చంద్రబాబు కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. ఈ అడ్డాలు ఇచ్చే ఫలితాలను పరిశీలించి రాష్ట్రమంతటా వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో 88 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని తెలిపారు. వారంతా చిన్న, పెద్ద పరిశ్రమలు, షాపుల్లో పనిచేస్తున్నారన్నారు. కార్మిక సంక్షేమానికి ఏటా రూ.615 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఒకప్పుడు



శారీరకంగా కష్టపడేవారని, ఇప్పుడు తెలివితేటలతో పనిచేయాలని సూచించారు. కార్మికుడి కొడుకు కంపెనీ ప్రారంభించే స్థితికి ఎదగాలని ఆకాంక్షిం చారు. ప్రపంచ స్థాయి ఆధునిక పనిముట్లు తీసుకొచ్చి త్వరలో అందజేస్తామన్నారు. కార్మికుల్లో నైపుణ్యం పెంచితే అదనంగా ఆదాయం వస్తుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 25 వేల మందికి శిక్షణ ఇస్తున్నామని.. రాబోయే రోజుల్లో మరింత మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మిక సంక్షేమ పథకాలకు జీవం పోశామన్నారు. 'నిర్మాణ రంగంలోని కార్మికుడు పెళ్లి చేసుకున్నా.. కార్మికుడి కుమార్తెకు వివాహం చేసినా రూ.25 వేలు ఇస్తున్నాం. ఎవరైనా కార్మికుడు చనిపోతే రూ.60 వేలు, అంత్యక్రియలకు తక్షణమే రూ.20 వేలు ఇస్తు న్నాం. కార్మికుల కోసం అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలు, శ్రీ సిటీలో ఈఎస్ఐ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామన్నారు.

# పంజాబ్ అసెంబ్లీలో రసాభాస!

**విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన ఆప్ ప్రభుత్వం**

**సీఎం మాన్ మద్యం తాగి సభకు వచ్చారంటూ కాంగ్రెస్ ఆరోపణ**

**బ్రీత్ అనలైజర్ పరీక్షకు డిమాండ్**


**తిరస్కరించిన స్పీకర్.. ప్రతిపక్ష సభ్యుల వాకౌట్**

**న్యూఢిల్లీ, మే 1 :**
పంజాబ్ శాసనసభలో శుక్రవారం తీవ్ర గందరగోళం చోటు చేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తమ ప్రభుత్వంపై శాసనసభలో విశ్వాస తీర్మానం పెట్టారు. అంతకముందు సీఎం మాన్ మద్యం తాగి సభకి వచ్చారంటూ కాంగ్రెస్ ఆరోపించడంతో రసాభస జరిగింది. సీఎం మాన్ సహా ఎమ్మెల్యేలందరికీ బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించాలన్న తమ డిమాండ్‌ను స్పీకర్ తిరస్కరించడంతో ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఆపై, సీఎం మాన్ ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానం నెగ్గింది. కార్మిక దినోత్సవం సందర్భంగా పంజాబ్ శాసనసభ శుక్రవారం ఒక్క రోజు ప్రత్యేకంగా సమావేశమైంది. ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు గత నెల 24న బీజేపీలో చేరారు. దీంతో పంజాబ్‌లోని ఆప్ సర్కారు కూలిపోనుందని, ఆప్ ఎమ్మెల్యేలు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటి సభలో సీఎం భగవంత్ మాన్ విశ్వాస తీర్మానాన్ని స్వయంగా ప్రవేశపెట్టారు. తమ పార్టీలో అంతా ఐకమత్యంగానే ఉన్నారని, తమ పార్టీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేసేందుకే విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నానని సీఎం మాన్ ఈ సందర్భంగా చెప్పారు. విశ్వాస తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించాలని సభ్యులను కోరారు. శుక్రవారం నిర్వహిస్తున్న ప్రత్యేక శాసనసభ సమావేశానికి అందరూ కచ్చితంగా హాజరుకావాలంటూ ఆప్ తమ పార్టీ ఎమ్మెల్యేలందరికీ ముందుగానే విప్ కూడా జారీ చేసింది. పంజాబ్ అసెంబ్లీలో 117 స్థానాలు ఉండగా.. ఆప్‌నకు 94 మంది ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌కు 16, శిరోమణి అకాలీదళ్‌కు ముగ్గురు, బీజేపీకి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. వారితోపాటు సభలో ఓ స్వతంత్ర ఎమ్మెల్యే కూడా ఉన్నారు. అయితే, సీఎం మాన్ విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే సమయానికి స్వతంత్ర ఎమ్మెల్యే రాణా ఇంద్రప్రతాప్ సింగ్ మినహా ప్రతిపక్ష సభ్యులు ఎవ్వరూ సభలో లేరు.



# భారత పౌరసత్వ నిబంధనల్లో మార్పులు

**న్యూఢిల్లీ, మే 1:**
పౌరసత్వ నిబంధనలు 2009కి పలు మార్పులను జోడిస్తూ పౌరసత్వ (సవరణ) నిబంధనలు 2026ను కేంద్ర హోంశాఖ నోటిఫై చేసింది. ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) కార్డుదారులు, పౌరసత్వ దరఖాస్తులకు సంబంధిం చిన ప్రక్రియల్లో డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. పౌరసత్వ చట్టం 1955లోని సెక్షన్ 7ఏ కింద ఓసీఐ కార్డు నమోదు, ఓసీఐ హోదాను వదులుకోవడానికి సబంధించిన అన్ని దరఖాస్తులను ఇకనుంచి ప్రభుత్వం నిర్దేశించిన అధికారిక పోర్టల్ ద్వారానే దాఖలు చేయాలని స్పష్టం చేసింది. రెండు ప్రతులుగా దరఖాస్తులు సమర్పించాలంటూ గతంలో ఉన్న నిబంధనను తొలగించింది. గురువారం ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం.. భారత పాస్‌పోర్టును కలిగి ఉన్న ఒక మైనర్.. ఏ సమయంలోనూ మరో దేశ పౌరసత్వాన్ని కలిగి ఉండకూడదు.



# హుస్నాబాద్‌లో వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఆరంభం

**మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పట్టు వస్త్రాల సమర్పణ, మహా అన్నదానం**



కలశంతో అమ్మవారి సన్నిధికి బయలుదేరిన పొన్నం దంపతులు

**హుస్నాబాద్,మే 1**

పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో పౌర్ణమి శుక్రవారం సందర్భంగా జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించగా, మహా అన్నదానం నిర్వహించారు. భక్తుల రద్దీ మధ్య బోనాలు, పట్నాలు సమర్పణలు, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా సాగాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో పౌర్ణమి శుక్రవారం సందర్భంగా జాతర ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం మంజుల ప్రభాకర్ గౌడ్ హాజరై ఆలయ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పోచమ్మ అమ్మవారి ప్రతిష్టా కార్యక్రమంలో భాగంగా పూర్ణాహుతి, కుంభాభిషేకం నిర్వహించి దేవాలయాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది. గౌడ కులస్తుల ఆధ్వర్యంలో బాసికాలు కట్టి జాతరను ప్రారంభించగా, ఆర్డీవో, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్, కమిషనర్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. బైండ్ల పంబల పూజారులు ఎల్లమ్మ కళ్యాణం కథ, సిద్ధోగం వివరించగా, శ్రీ రేణుక ఎల్లమ్మ -- జమదగ్ని మహాముని దివ్య కళ్యాణ మహోత్సవం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో, వివిధ దేవాలయాల అర్చకుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ నూతనంగా నిర్మించిన వసతి భవనాన్ని కూడా ప్రారంభించారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు, పట్నాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంకాలం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో జగిత్యాల సింగారపు రాజకుమార్ బృందం ఒగ్గు కథను, కరీంనగర్‌కు చెందిన రతన్ కుమార్ బృందం పేరిణి నాట్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్కులు కాదు.. మీ ప్రాణమే ముఖ్యం

## విద్యార్థులకు పోలీస్ కమిషనర్ భరోసా



మాట్లాడుతున్న జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ (ఫైల్ ఫోటో)

**సిద్ధిపేట, మే 1**

పదో తరగతి ఫలితాల విడుదల నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ సూచించారు. పరీక్షల్లో వచ్చిన మార్కులు జీవితాన్ని నిర్ణయించవని, ఫలితం ఏదైనా అది భవిష్యత్తుకు కొత్త ఆరంభమేనని తెలిపారు. ఆశించిన ఫలితాలు రాకపోయినా నిరాశకు లోనుకావద్దని, ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం సమస్యలకు పరిష్కారం కాదని ఆమె స్పష్టం చేశారు. ఒక ఓటమి విజయానికి తొలి అడుగుగా భావించాలని, ధైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు పిల్లలపై అధిక ఒత్తిడి తీసుకురావద్దని, ఇతరులతో పోల్చి వారిని చిన్నబుచ్చవద్దని కమిషనర్ కోరారు. ఫలితాల తర్వాత పిల్లలు మౌనంగా ఉండటం, ఒంటరిగా ఉండేందుకు ప్రయత్నించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వారితో మాట్లాడి ధైర్యం చెప్పాలని సూచించారు. విద్యార్థులకు సిద్దిపేట జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. మానసిక ఒత్తిడికి లోనైన వారు తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా సహాయం కోరాలని విజ్ఞప్తి చేశారు.

సహాయం కోసం: 8712667100 లేదా డయల్ 100"మీ సమస్యను మాతో పంచుకోండి.. మేము మీకు అండగా నిలుస్తాం" అని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ భరోసా ఇచ్చారు.

# సిద్ధిపేటలో నీట్ (యూజీ)-2026 పరీక్షకు విస్తృత ఏర్పాట్లు

**అభ్యర్థులు మధ్యాహ్నం 1:30 లోపు కేంద్రాలకు చేరాలి**



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి ఫైల్ ఫోటో

**సిద్ధిపేట, మే 1**

సిద్ధిపేట జిల్లాలో ఆదివారం, మే 3న నిర్వహించనున్న నీట్ (యూజీ)--2026 పరీక్షకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరగనుంది. జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేటతో పాటు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (ఎడ్యుకేషన్ కాంప్లెక్స్)లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల మధ్య కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. మధ్యాహ్నం 1:30 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. అడ్మిట్ కార్డు, అసలు ఫోటో గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాగులు, ఆభరణాలు తదితర నిషేధిత వస్తువులను కేంద్రాలకు తీసుకురావద్దని సూచించారు. పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పరిపాలన, పోలీసు శాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కె హైమావతి, అధికారులు తెలిపారు.

# మూసివేసిన క్రషర్ మిల్లులే టార్గెట్

**భారీ చోరీల ముఠా అరెస్ట్**

**అక్కన్నపేట పోలీసుల చాకచక్యం..**

**నిందితులు రిమాండ్‌కు తరలించిన ఎస్సై సీహెచ్ ప్రశాంత్**

**హుస్నాబాద్ రూరల్, మే 1**

అక్కన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుసగా జరుగుతున్న క్రషర్ మిల్లుల చోరీల కేసులను అక్కన్నపేట ఎస్సై చాతరాజు ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసులు ఛేదించారు. మూసివేసిన క్రషర్ మిల్లులను లక్ష్యంగా చేసుకుని అక్కడి ఖరీదైన యంత్ర సామాగ్రి, మోటార్లు, ఇనుప వస్తువులు, ఎలక్ట్రిక్ కేబుల్ వైర్లు దొంగిలిస్తున్న ఇద్దరు సభ్యుల ముఠాను శుక్రవారం అక్కన్నపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం.. గత కొంతకాలంగా మండల పరిధిలోని మూసివేసిన క్రషర్ మిల్లుల్లో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్ తన సిబ్బందితో కలిసి అనుమానాస్పద వ్యక్తులపై తనిఖీలు నిర్వహించారు. అనుమానం కలిగిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారు పలు చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. విచారణలో అక్కన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరికిబండ క్రషర్‌లో చోరీ చేసినట్లు, చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రషర్ మిల్లుల నుంచి మోటార్లు,



దోపిడి ముఠా అరెస్టు చూపిస్తున్న అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్

హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలక్ట్రిక్ కేబుల్ వైర్లు దొంగిలించినట్లు వెల్లడించారు. ఈ కేసులో నిందితులు మేడిపల్లి గ్రామానికి చెందిన నూనె సాయికిరణ్ (20), నెల్లూట్ల శేఖర్ (20),లు అని పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ వెల్లడించారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## తెలంగాణ భవన్‌లో ఘనంగా మేడే వేడుకలు

**హైదరాబాద్, మే 1**



అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ బీఆర్‌టీయూ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మికుల సమస్యలు, సంక్షేమ చర్యలపై చర్చ జరిగింది. కార్మికుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. మేడే సందర్భంగా కార్మికుల కృషిని గుర్తు చేసుకుంటూ, సమాజ నిర్మాణంలో వారి పాత్ర ఎంతో గొప్పదని ఆయన అన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కార్మికులు కీలక స్థంభమని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సమావేశం అనంతరం కేటీఆర్ కార్మికులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. కార్మికులతో కలిసి కూర్చొని భోజనం చేయడం ద్వారా వారికి తన మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

## వ్యక్తిగతంగా తీరని లోటు : భట్టి

**సీపీఆర్వో మధుసూదన్ మరణంపై భట్టి విక్రమార్క సంతాపం**

**మిర్యాలగూడలో కుటుంబాన్ని పరామర్శ**

**కుటుంబానికి అండగా ఉంటామని హామీ**



**మిర్యాలగూడ, మే 1**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తన సీపీఆర్వోగా పనిచేసిన మధుసూదన్ ఆకస్మిక మరణంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మధుసూదన్ కేవలం అధికారి మాత్రమే కాకుండా తన కుటుంబ సభ్యుడిలా అన్న ప్రతి అడుగులో వెన్నంటి ఉండేవాడని భావోద్వేగంగా పేర్కొన్నారు.మధుసూదన్ వృత్తి పట్ల చూపిన అంకితభావం, నిబద్ధతను ఎప్పటికీ మరువలేమని భట్టి విక్రమార్క తెలిపారు. ఆయన మరణం తనకు వ్యక్తిగతంగా తీరని లోటు అని అన్నారు. పాత్రికేయ విలువలకు మారుపేరుగా నిలిచిన వ్యక్తిగా మధుసూదన్ గుర్తుండిపోతారని పేర్కొన్నా రు. ఈ నేపథ్యంలో భట్టి విక్రమార్క మిర్యాలగూడలోని మధుసూదన్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబాన్ని ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సమయంలో కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. మధుసూదన్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భట్టి హామీ ఇచ్చారు. ఆయన భార్య జ్యోతి బదిలీ విషయంలో సహకారం అందిస్తామని, బీటెక్ పూర్తి చేసిన కుమారుడు సూరజ్ భవిష్యత్తుకు సంబంధించిన విషయాల్లో కూడా ప్రభుత్వం తరపున, వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. మధుసూదన్ సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయని భట్టి అన్నారు. కుటుంబానికి ఎటువంటి అవసరం వచ్చినా కంటికి రెప్పలా కాపాడుతామని తెలిపారు. ఈ సందర్భంగా అక్కడి వాతావరణం భావోద్వేగభరితంగా మారింది. మధుసూదన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని భట్టి విక్రమార్క ప్రార్థించారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

## తెలంగాణ డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు

**గౌరవ వందనంతో అధికారిక బాధ్యతలు ప్రారంభం**

**మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో విశేష అనుభవం**

**టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యం**



**హైదరాబాద్, మే 1**

తెలంగాణ రాష్ట్ర పోలీసు వ్యవస్థకు కీలక మలుపుగా భావించే పరిణామంలో సీవీ ఆనంద్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ రోజు ఉదయం డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు ఉన్నతాధికారులు సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి అధికారికంగా తన బాధ్యతలను చేపట్టారు. 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ పోలీసు సేవల్లో విశేష అనుభవం సంపాదించారు. క్షేత్రస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు వివిధ బాధ్యతలు నిర్వహించిన ఆయన, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పనిచేసిన సమయంలో మావోయిస్టు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని శాంతిభద్రతలను కాపాడడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను అప్పట్లోనే విశేషంగా గుర్తించారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో నగర భద్రతలో సీవీ ఆనంద్ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చేందుకు పలు చర్యలు చేపట్టారు. నగర భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఆయన కృషి కీలకంగా నిలిచింది. టెక్నాలజీ వినియోగంలో సీవీ ఆనంద్ ప్రత్యేకంగా గుర్తింపు పొందారు. ఈ-చలాన్ విధానం, స్పీడ్ గన్స్ వంటి వ్యవస్థలను ప్రవేశపెట్టి ట్రాఫిక్ నియంత్రణలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. అలాగే రివర్సిబుల్ లేన్లు, ఫ్రీ లెఫ్ట్ వంటి విధానాల ద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో వినూత్న పరిష్కారాలు అమలు చేశారు.డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలు, సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్స్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఆధునిక టెక్నాలజీ ఆధారంగా పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చేందుకు కొత్త వ్యూహాలను అమలు చేసే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే పోలీసు శాఖలో విశేష అనుభవం కలిగిన సీవీ ఆనంద్ డీజీపీగా బాధ్యతలు చేపట్టడం రాష్ట్ర భద్రతా వ్యవస్థకు బలాన్నిస్తుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన నాయకత్వంలో తెలంగాణ పోలీసు వ్యవస్థ మరింత అభివృద్ధి చెందుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు..




**రామకృష్ణాపూర్, మే 01,( మన సమాజం) :** ప్రపంచ కార్మిక దినోత్సవ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి ప్రధాన దారి వద్ద ఉన్న సింగరేణి కార్మిక విగ్రహానికి జిల్లా పార్టీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, జిల్లా మాజీ అధికార ప్రతినిధి ఓడ్నాల శ్రీనివాస్ లు పూలమాలవేసి కార్మిక క్షేత్రానికి మేడే శుభాకాంక్షలు తెలిపారు. సివిల్ డిపార్ట్మెంట్ లో కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న వారిని శాలువాలతో సన్మానించారు. అలాగే పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ అజీజ్, నాయకులు గాండ్ల సమ్మయ్య, మహంకాళి శ్రీనివాస్ లు మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను సన్మానించి భోజన వసతి ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులు తమ రక్తాన్ని చెమట రూపంలో చిందించి సింగరేణి మనుగడను కాపాడుతున్నారని పేర్కొన్నారు. పని ఏదైనా కార్మికులు అంకితభావంతో పని చేస్తున్నారు కాబట్టే



మున్సిపాలిటీతో పాటు సింగరేణిలోని అన్ని కాలనీలు పరిశుభ్రంగా ఉంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కూతురు ప్రభాకర్, మాజీ వైస్ ఛైర్మెన్ సాగర్ రెడ్డి, సుధాకర్, శ్రీను, విక్రమ్, చంద్రయ్య పాల్గొన్నారు.

# సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు..



**రామకృష్ణాపూర్, మే 01, (మన సమాజం):** ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సెంట్రల్ సెక్రెటరీ అక్బర్ అలీ, సిహెచ్పి లో ఫిట్ సెక్రటరీ హరీరామకృష్ణ, ఎనిమిదవ వార్డు లో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తూ పలు కాలనీలలో జెండా ఆవిష్కరించారు. ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవెన శంకర్, నాయకులు మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని దినాల కోసం ఆనాటి కార్మికులు చేసిన ప్రాణ త్యాగ ఫలితమే నేడు మేడే గా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అలాగే 44 గా ఉన్న కోడ్ లను 4 కోడ్ లుగా సవరించే విధానాన్ని వెంటనే విరమించుకోవాలని హెచ్చరించారు. అనంతరం 16 వ వార్డుకు చెందిన నరెడ్ల వెంకన్న కల్పన దంపతులు సీతారామయ్య ఆధ్వర్యంలో సీపీఐ పార్టీలో చేరారు. ఈ మేరకు ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ మిట్టపల్లి సరిత, 6, 8 వార్డుల కౌన్సిలర్లు శంకర్, ముని, సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, నాయకులు పౌల్, సంపత్, వనం సత్యనారాయణ, రవి, హుస్సేన్, మణెమ్మ, సంపత్, రమేష్, అనిల్, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# పాన్‌కార్డ్ హోల్డర్స్‌కి కేంద్రం హెచ్చరిక

**న్యూఢిల్లీ**

దీనివల్ల ఫ్యూచర్‌లో వారికి ఆర్థిక లావాదేవీల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు విధించిన గడువు ఇప్పటికే ముగియడంతో, లింక్ చేయని పాన్ కార్డులు నిరుపయోగంగా మారే ప్రక్రియ వేగవంతమైంది. దీనివల్ల వారి ఆర్థిక లావాదేవీలన్నీ పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఉంది. ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 139ఏఏ ప్రకారం ప్రతి ఒక్కరూ తమ పాన్‌కార్డును ఆధార్‌తో తప్పనిసరిగా అనుసంధానం చేయాలి. పన్ను ఎగవేతలను అరికట్టడం, నకిలీ పాన్ కార్డులను ఏరివేయడం, పారదర్శకమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించడం వంటి లక్ష్యాలతో ప్రభుత్వం ఈ నిబంధనను తీసుకొచ్చింది. పలుమార్లు గడువు పొడిగించినప్పటికీ, ఇంకా లక్షలాది మంది ఈ ప్రక్రియను పూర్తి చేయలేదు. గడువు ముగిసిపోవ డంతో, ఇప్పుడు వీటిని లింక్ చేసుకోవాలంటే తప్పనిసరిగా రూ.1000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ పాన్‌కార్డ్ రద్దయితే మీరు చట్ట ప్రకారం పాన్ కార్డు లేని వ్యక్తిగానే పరిగణిం చబడతారు. ఫలితంగా మీరు ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయలేరు. మీకు రావాల్సిన పన్ను రిఫండ్లు నిలిచిపోతాయి. మీ జీతం, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ, ఇతర ఆదాయాలపై అధిక రేటుతో టీడీఎస్ కట్ అవుతుంది. రూ.50,000 మించిన బ్యాంకింగ్ లావాదేవీలు జరపడం కష్టమవు తుంది. కొత్తగా డీమ్యాట్ ఖాతా తెరవలేరు. ఆస్తుల క్రయవిక్రయాల్లో ఆటంకాలు ఎదుర్కోవాల్సి




వస్తుంది. వాహనాలు కొనడం లేదా అమ్మడం వంటి రిజిస్ట్రేషన్ ప్రక్రియలు నిలిచిపోతాయి.అయితే ఈ సమస్య నుంచి బయటపడేందుకు ఇంకా ఛాన్స్ ఉంది. రూ.1000 జరిమానా చెల్లించి, పాన్‌ను తిరిగి యాక్టివేట్ చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబం ధనలను తేలికగా తీసుకోకుండా, వెంటనే మీ పాన్-ఆధార్ లింకింగ్ స్టేటస్‌ను చెక్ చేసుకోండి. ఒకవేళ లింక్ చేయకపోతే, వెంటనే చేయటం మంచిది.

# మహిళలకు అండగా కేంద్ర ప్రభుత్వ పథకం..




**న్యూఢిల్లీ**

దేశంలోని మహిళలు అన్ని రంగాల్లో సమానంగా ఎదగాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగిని పథకాన్ని తీసుకువచ్చింది. మహి ళలు స్వయం ఉపాధి సాదించాలని, ఆర్థికంగా ఎదగాలని వారికి ఆర్థిక భరోసా ఇస్తోంది. సొంత వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలకు వడ్డీ లేని రుణాలు లేదా తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తోంది. అంతే కాకుండా రుణాల చెల్లింపులో కూడా సబ్సిడీ ఇస్తోంది. మహిళలు స్వంత కాళ్లపై నిలబడి వ్యాపార రంగంలో రాణించాలని కేంద్రం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. కేంద్రం అమలు చేస్తున్న ఈ పథకాన్ని పలు రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కూడా అమలవుతోంది. మహిళలు సొంతంగా చిన్న, మధ్య తరహా వ్యాపారాలు ప్రారంభించడానికి ఉపయోగపడుతోంది.లోన్ ఎంత వస్తుంది?ఉద్యోగిని పథకం కింద మహిళలు గరిష్టంగా రూ.3 లక్షల వరకు లోన్ వస్తుంది. ఈ రుణానికి మహిళలు ఎలాంటి సెక్యూరిటీ ఇవ్వాల్సిన పని లేదు. ఈ లోన్ తిరిగి చెల్లించడానికి బ్యాంకులు సుమారుగా 3 నుంచి 7 సంవత్సరాల వరకు సమయాన్ని ఇస్తాయి. ఇది తీసుకున్న లోన్ మొత్తం, బ్యాంకు నిబంధనలపై ఆధారపడి ఉంటుంది. దరఖాస్తు చేయనున్న మహిళ వయస్సు 18 నుంచి 55 ఏళ్ళ మధ్య ఉండాలి. దరఖాస్తుదారు ఇంతకు ముందు ఏ ఆర్థిక సంస్థ నుంచి తీసుకున్న రుణాలకూ ఎగవేతదారుగా ఉండకూడదు. దరఖాస్తుదారు కుటుంబ వార్షిక ఆదాయం సాధారణంగా రూ.2,00,000 మించకూడదు. వితంతువులు, వికలాంగులు, దళిత మహిళలు వంటి కొన్ని వర్గాల మహిళలకు అన్యువల్ ఇన్ కమ్ లిమిట్ వర్తించదు. ఇక కొన్ని రాష్ట్రాల్లో అయితే ఆ రాష్ట్రంలో శాశ్వతంగా నివసిస్తున్నవారై ఉండాలి.

# క్రెడిట్ కార్డు యూజర్లకు గమనిక..




**న్యూఢిల్లీ**

తమ బ్యాంకు అకౌంట్‌లో జీతం పడే ఉద్యోగులకు.. ఆర్థికంగా కాస్త తోడు ఉండేందుకు, వారికి సహాయంగా ఉంటూనే ఆదాయాన్ని పొందేందుకు బ్యాంకులు క్రెడిట్ కార్డును అందజేస్తుంది. క్రెడిట్ కార్డుతో ముందుగానే కొంత డబ్బును ఇచ్చి, ఆ డబ్బును వాడుకోవడానికి వీలు కల్పిస్తాయి. దీంతో ఉద్యోగి, క్రెడిట్ కార్డుతో తమ ఆర్థిక అవసరాలను తీర్చుకుంటాడు. తనకు వచ్చిన కార్డు లిమిట్‌లో డబ్బును ఆర్థిక అవసరాలకు ఉపయోగిస్తూ నెల రోజుల సమయంలో ఈఎమ్ఐ ఆప్షన్ తో డబ్బును చెల్లించే అవకాశం ఉంటుంది. దీంతో యూజర్, తమకు నచ్చినంత డబ్బును అవసరానికి ఉపయోగించుకుంటాడు. అయితే క్రెడిట్ కార్డుతో లాభంతోపాటు నష్టాలు కూడా చాలానే ఉన్నాయి. తీసుకున్న డబ్బును సమాయానికి చెల్లించకపోతే భారీగా వడ్డీతో పాటు బ్యాంక్ మనీ రికవరీ ఏజెంటులు ఒత్తిడి చేస్తారు. సమయానికి డబ్బులు చెల్లిస్తే.. మంచి క్రెడిట్ స్కోరు ఉంటుంది. దీంతో తదుపరి ఏదైనా లోన్ తీసుకోవాలనుకుంటే ఇది చాలా ఉపయోగపడుతుంది. అయితే సరైన సమయానికి క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించేవారి డబ్బుల పరిమితిని బ్యాంకులు పెంచుతూ ఉంటాయి. బాధ్యతాయుతంగా ఉన్న కార్డు యూజర్‌కు బ్యాంక్ ఆఫర్ చేసే లిమిట్ పెంచుకోవాలా? తిరస్కరించాలా? అనేది కార్డుదారుని నిర్ణయంపై ఆధారపడి ఉంటుందిఅయితే క్రెడిట్ కార్డుతో లాభంతోపాటు నష్టాలు కూడా చాలానే ఉన్నాయి. తీసుకున్న డబ్బును సమాయానికి చెల్లించకపోతే భారీగా వడ్డీతో పాటు బ్యాంక్ మనీ రికవరీ ఏజెంటులు ఒత్తిడి చేస్తారు. సమయానికి డబ్బులు చెల్లిస్తే.. మంచి క్రెడిట్ స్కోరు ఉంటుంది. దీంతో తదుపరి ఏదైనా లోన్ తీసుకోవాలనుకుంటే ఇది చాలా ఉపయోగపడుతుంది. అయితే సరైన సమయానికి క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించేవారి డబ్బుల పరిమితిని బ్యాంకులు పెంచుతూ ఉంటాయి. బాధ్యతాయుతంగా ఉన్న కార్డు యూజర్‌కు బ్యాంక్ ఆఫర్ చేసే లిమిట్ పెంచుకోవాలా? తిరస్కరించాలా? అనేది కార్డుదారుని నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.క్రెడిట్ స్కోర్ వాడేవారి పర్ఫార్మెన్స్ క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో ద్వారా వెల్లడవుతుంది. యూజర్ కు ఇచ్చిన కార్డు లిమిట్ లో ఎంత శాతం క్రెడిట్‌ను వాడుకున్నామో దాన్నే సీయూఆర్ అంటారు. ఇది 30 శాతం ఉండేలా చూసుకోవాలని నిపుణులు తెలుపుతున్నారు. ఉదాహరణకు మీ కార్డు లిమిట్ రూ.లక్ష ఉన్నట్లయితే నెలకు రూ.30 వేలు లావాదేవీలు చేస్తే యుటిలైజేషన్ రేషియో 30 శాతం ఉంటుంది. ఒకవేళ మీ బ్యాంకు ఆ లిమిట్‌ను రూ.2 లక్షలకు పెంచితే.. మీరు అదే రూ.30 వేలు వాడినట్లయితే సీయూఆర్ 15 శాతం అవుతుంది. అంటే 15 శాతం తగ్గుతుంది. ఇలా తక్కువగా వాడటం వలన మంచి క్రెడిట్ స్కోరు ఉంటుంది. సకాలంలో బిల్లులు చెల్లించడం, బకాయిలు పెండింగ్ లో లేనప్పుడు క్రెడిట్ లిమిట్ ని పెంచుకోవచ్చు. ఒకవేళ బకాయిలు మినిమమ్ అమౌంట్ మాత్రమే కడుతూ ఉంటే లిమిట్ ఇంక్రీజ్ జోలికి వెళ్లకుండా వెళ్లడమే ఉత్తమం

# ఐటీ రిఫండ్స్ ఇంకా రాలేదా




పెద్ద మొత్తంలో ఆదాయ పన్ను చెల్లించిన చాలా మందిలో ఇప్పుడు ఒకటే టెన్షన్. తమకు రావాల్సిన రిఫండ్ ఎప్పుడు వస్తుందా? అని. రిటర్నులు దాఖలు చేసిన కొద్ది రోజుల్లోనే ఈ ప్రక్రియ ప్రారంభమై ఆయా వ్యక్తుల రిఫండ్స్ మొత్తం వారి ఖాతాల్లో జమ అయ్యేది. అయితే ఈసారి మాత్రం రిఫండ్స్ ఆలస్యమవుతుండటంతో చాలా మందిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ విషయంలో చాలా మంది తమ బాధను వెళ్లగక్కేందుకు సోషల్ మీడియాను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు డిసెంబరు నెలాఖరు కల్లా రిఫండ్స్ ప్రక్రియను పూర్తి చేస్తామని ఐటీ శాఖ అంటోంది. ఇంతకీ ఆదాయ పన్ను (ఐటీ) శాఖ నుంచి రావాల్సిన రిఫండ్స్ ఎందుకు ఆలస్యం అవుతున్నాయో ఒకసారి తెలుసుకుందాం. అంతేకాదు రిఫండ్ స్టేట్‌సతో పాటు ఎలా చెక్ చేసుకోవాలో తెలుసుకుందాం. టీడీఎస్, అడ్వాన్స్ ట్యాక్స్ లేదా సెల్ఫ్ అసెసమెంట్ ద్వారా చెల్లించాల్సిన పన్ను కంటే అధిక ఆదాయ పన్ను చెల్లించిన ఆదాయ పన్ను చెల్లింపుదారులు అందరూ ఐటీ రిఫండ్స్‌కు అర్హులు. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 143 (1) ప్రకారం ఆర్థిక సంవత్సరం ముగిసిన తొమ్మిది నెలల్లోగా ఐటీ శాఖ ఐటీ రిటర్నుల ప్రాసెసింగ్ పూర్తి చేయాలి. అంటే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వచ్చే నెలాఖరు వరకు ఇందుకు గడువు ఉంది. అయితే ఎప్పటిలోగా రిఫండ్ ప్రక్రియ పూర్తి చేయాలనే దానిపై మాత్రం ఎలాంటి స్పష్టత లేదు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటర్నుల ఫైలింగ్ ఈ ఏడాది సెప్టెంబరు 16తో ముగిసింది. దీంతో ఐటీ శాఖ ఈ ఏడాది డిసెంబరులోగా రిటర్నుల ప్రాసెసింగ్ పూర్తి చేయాలి. అన్నీ సజావుగా ఉన్న రిఫండ్స్ క్లెయిమ్స్‌ను కూడా ఆ లోగానే పూర్తి చేస్తామని ఇటీవల సీబీడీటీ చీఫ్ రవి అగర్వాల్ ప్రకటించడం విశేషం.

# అదే ఆర్థ్రయిటిస్‌కు విరుగుడు

'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ ద్యాన్ క్యూర్' అనే మాట ఆర్థ్రయిటిస్‌కూ వర్తిస్తుంది. యోగాభ్యాసం ఎంత చిన్న వయసులో మొదలు పెడితే, ఆర్థ్రయిటిస్‌ను అంత సమర్థంగా నియంత్రించుకోవచ్చు. ఆర్థ్రయిటిస్‌ను అరికట్టే యోగాసనాలు ఇవే!

**సమస్థితి/తాడాసనం**

నిటారుగా నిలబడి, చేతులు పైకి లేపి, అరచేతులు ఆనించాలి. ఇలా నిలబడినప్పుడు శరీర బరువు రెండు కాళ్ల మీద సమంగా పడేలా చూసుకోవాలి. భుజాలను వదులుగా ఉంచి, పొత్తికడుపును బిగించాలి. ఈ భంగిమలో నిలబడి 8 నుంచి 10 సార్లు శ్వాస పీల్చుకుని వదలాలి.

**పశ్చిమోత్తనాసనం**

నేల మీద కూర్చుని, కాళ్లను ముందుకు చాపాలి. ఇలా కూర్చున్నప్పుడు మోకాళ్లు స్వల్పంగా వంగేలా చూసుకోవాలి. వెన్నును నిటారుగా ఉంచి, నెమ్మదిగా ముందుకు వంగి, మేచేతులు నేలకు తగిలేలా ఉంచి, రెండు చేతులతో కాలి వేళ్లను దగ్గరకు లాగాలి. ఈ భంగిమలో తలను మోకాళ్లకు ఆనించాలి. ముందుకు వంగేటప్పుడు శ్వాసను వదులుతూ, పైకి లేచేటప్పుడు శ్వాస పీల్చుకోవాలి.

**ధనురాసనం**

బోర్లా పడుకుని, మెకాళ్లను వెనక్కి మడవాలి. తర్వాత రెండు చేతులతో కాలి గిలకలను పట్టుకోవాలి. చేతులు, కాళ్లను సాధ్యమైనంత పైకి లేపాలి. ఈ భంగిమలో తలను పైకి లేపి పైకి చూస్తూ ఉండాలి.

**ప్రాణాయామ/కపాలభాతి**

కపాలం అంటే 'పుర్రె', భాతి అంటే 'కాంతి' అని సంస్కృత అర్థం. సుఖాసనం, అర్ధ పద్మాసనం లేదా పద్మాసనం... ఇలా ఏదైనా సౌకర్యవంతమైన భంగిమలో కూర్చోవాలి. ఈ భంగిమలో కళ్లు మూసుకుని, వెన్ను నిటారుగా ఉంచి, అర చేతులు మోకాళ్ల మీద ఉంచాలి. తర్వాత నెమ్మదిగా శ్వాస పీల్చుకుని, పొట్టను లోపలికి లాక్కుంటూ శ్వాసను పూర్తిగా బయటకు వదలాలి.

**జల ధ్యానం**

ఇదొక జల సంబంధ ధ్యానం. ఈ ధ్యానంలో భాగంగా 'నీరు నాకు మేలైనది, పవిత్రమైనది' అని మనసులో స్మరించుకోవాలి. ఇలా స్మరించి నీళ్లు తాగడం వల్ల శరీర శుద్ధి జరిగి, నీటికున్న అపూర్వమైన శక్తి శరీరానికి అందుతుంది.



# అప్పటి ప్రేమలే గొప్పవి..

90ల నాటి ప్రేమలే ఎంతో గొప్పవనీ, వాటినే తాను బలంగా నమ్ముతానని అంటున్నది బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే. నేటితరం ఫాలో అవుతున్న డేటింగ్ ట్రెండ్స్, ఆధునిక హుక్అప్ సంస్కృతికి తాను పూర్తిగా వ్యతిరేకమని చెబుతున్నది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. వ్యక్తిగత జీవితం, ఫ్యామిలీ వ్యాల్యూస్ గురించి తన అభిప్రాయాలను పంచుకున్నది. తాను కుటుంబానికి, ఫ్యామిలీ ఎమోషన్స్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించింది. “నేను నా కుటుంబాన్ని ఎంతో ప్రేమిస్తున్నా. నా భాగస్వామి కూడా అలాగే ఉండాలని ఆశిస్తున్నా. అంతేకాదు.. అతని కుటుంబం కూడా నా కుటుంబంలాగే మారాలని కోరుకుంటున్నా!” అంటూ.. ఫ్యామిలీ ఎమోషన్స్ గురించి చెప్పుకొచ్చింది. పాతకాలం నాటి సాంప్రదాయ ప్రేమకథలంటే తనకు ఎంతో నమ్మకమనీ.. అదే తాజా సినిమాలో తాను పోషించిన రూమీ పాత్రకు తనను మరింత దగ్గర చేసిందనీ అంటున్నది. అనన్య మాటలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు నెటిజన్లు.. అనన్య పాండేపై వచ్చిన డేటింగ్ రూమర్స్‌ను గుర్తుచేస్తున్నారు. ఇషాన్ ఖత్తర్, కార్తిక్ ఆర్యన్, ఆదిత్యరాయ్ కపూర్ వంటి స్టార్లతో డేటింగ్ ముచ్చట్ల గురించీ చెప్పాలని కామెంట్లు పెడుతున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు చుంకీ పాండే కూతురైన అనన్య.. హిందీ పరిశ్రమలో అత్యంత పాపులర్ హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్నది. తన గ్లామర్, స్టయిల్, ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌తో దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నది.

# కాలంతో ప్రయాణం



ఈ ఏడాది తెలుగులో ‘ఓజీ’ చిత్రంతో భారీ విజయాన్ని దక్కించుకుంది కన్నడ భామ ప్రియాంక మోహన్. ప్రస్తుతం ఆమె దక్షిణాదిన భారీ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉంది. తాజాగా ఈ సొగసరి కన్నడ చిత్రం ‘666: ఆపరేషన్ డ్రీమ్ థియేటర్’లో భాగమైంది. ధనంజయ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి హేమంత్ ఎం రావు దర్శకుడు. శివరాజ్‌కుమార్ కీలక పాత్రధారి. శనివారం ఈ సినిమా నుంచి ప్రియాంక మోహన్ ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఇందులో ఆమె వింటేజ్ లుక్‌లో కనిపిస్తున్నది. టైమ్‌ట్రావెల్ కథాంశమిదని, ప్రేక్షకుల్ని సరికొత్త ఫాంటసీ ప్రపంచంలోకి తీసుకెళ్తుందని, ప్రియాంక మోహన్ పాత్ర భిన్న కోణాల్లో సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఇప్పటికే మూడు షెడ్యూల్స్ పూర్తయ్యాయని, తెలుగు, కన్నడ భాషల్లో భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత వైశాక్ జె గౌడ తెలిపారు. ఈ చిత్రానికి చరణ్‌రాజ్ స్వరకర్త.

## భయపెడుతూ ఆలోచింపజేస్తుంది



అఖిల్‌రాజ్, త్రిగుణ్, హెబ్బాపటేల్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన హారర్ థ్రిల్లర్ ‘ఈషా’. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. హేమ వెంకటేశ్వరరావు నిర్మాత. ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదరప్రసాద్ సమర్పకుడు. ఈ నెల 25న క్రిస్మస్ కానుకగా సినిమా విడుదలైంది. ఈ నేపథ్యంలో బ్లాక్‌బస్టర్ మీట్‌ని మేకర్స్ నిర్వహించారు. గట్టి వసూళ్లతో సినిమా దూసుకుపోతున్నదని, తొలి రోజే తెలుగు రాష్ట్రాల్లో రెండు కోట్ల 20లక్షలు వసూలు చేసిందని, ఫైనల్‌గా బాక్సాఫీస్ విన్నర్‌గా నిలిచిందని సమర్పకుల్లో ఒకరైన బన్నీవాస్ చెప్పారు. ఇది కేవలం హారర్ ఫిల్మ్ మాత్రమే కాదని, ఆలోచింపజేసే సినిమా ఇదని మరో సమర్పకుడు వంశీ నందిపాటి చెప్పారు. ఇంకా నిర్మాత వెంకటేశ్వరావు, నటుడు త్రిగుణ్, సీనియర్ నిర్మాత దామోదరప్రసాద్ కూడా మట్లాడారు.

# విశ్వనాథన్ అండ్ సన్స్?



తమిళ డబ్బింగ్ చిత్రాల ద్వారా తెలుగులో తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు అగ్ర హీరో సూర్య. ఆయన ప్రస్తుతం తెలుగు స్ట్రెయిట్ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి ‘విశ్వనాథన్ అండ్ సన్స్’ అనే టైటిల్‌ను ఖరారు చేయబోతున్నారని తెలిసింది. ఇప్పటికే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేయించారని, త్వరలో అధికారిక ప్రకటన ఉంటుందని సమాచారం. తాజా ఇంటర్వ్యూలో ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. ఈ చిత్రంలో హీరో సూర్య తన వయసుకు తగిన పాత్రలోనే కనిపిస్తారట. 40ప్లస్ వయసు వున్న వ్యక్తి 20 ప్లస్ అమ్మాయితో సాగించే ప్రేమాయణం, వారి మధ్య నడిచే భావోద్వేగభరిత ప్రయాణం నేపథ్యంలో ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారట. ఈ తాజా సమాచారంతో సినిమా కాన్సెప్ట్ ఏమిటన్నది అందరిలో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఈ చిత్రంలో మమితాబైజు కథానాయికగా నటిస్తున్నది.

# ఆ హక్కు.. అందరికీ ఉంది!

తమ రూపాన్ని మెరుగుపరుచుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని అంటున్నది బుల్లితెర నటి ప్రియాంక చాహర్ చౌదరి. సర్జరీలతో శరీరాన్ని నాజూకుగా మలుచుకున్నదంటూ.. ప్రియాంకపై కొద్దికాలంగా సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోల్స్ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. తనపై వస్తున్న రూమర్లపై స్పందించింది ప్రియాంక. “సర్జరీలతో నా రూపాన్ని మార్చుకున్నానని కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. చాలాకాలంగా ఇలాంటి మాటలు వింటూనే ఉన్నాను. కానీ, అవన్నీ వాస్తవాలు కాదు” అంటూ చెప్పింది. “గతేడాది నా ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాను. ఎక్కువ మోతాదులో యాంటి బయాటిక్స్ తీసుకోవాల్సి వచ్చింది. అయితే, చాలా మందికి ఈ విషయం తెలియదు. వాటి ప్రభావం వల్లే నేను బరువు తగ్గాను. నా ముఖంలోనూ కొద్దిగా మార్పులు వచ్చాయి. దానికే కొందరు ఏదేదో ఊహించుకుంటున్నారు. నాపై లేనిపోని ఆరోపణలు గుప్పిస్తున్నారు” అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఇక ప్రతి ఒక్కరికీ తమ రూపాన్ని మెరుగుపరుచుకునే హక్కు ఉందనీ, అది పూర్తిగా వారి ఇష్టమేనని స్పష్టం చేసింది. “నేను కళ్లకు కాజల్ అద్దుకున్నా, లెన్స్ పెట్టుకున్నా.. ముఖానికి ఏదో చేయించుకున్నానని అనుకుంటారు. అందుకే నేను చెప్పేదేంటంటే.. నా ముఖం.. నా ఇష్టం!” అంటూ ఘాటుగా స్పందించింది. అయినా, తన ముఖానికి మేకప్ తప్ప ఏదీ చేయలేదనీ, అయినప్పటికీ కొందరు నమ్మడం లేదనీ వాపోయింది. ఇంకా ఏదేదో మాట్లాడుతూనే ఉంటారనీ, అలా గాసిప్స్‌ను ప్రచారం చేయడం సరైన పద్ధతికాదని హితవుపలికింది.

